# సినిమాందిజ్ఞనికి

## శ్రీమతి వేదవతీదేవి

"గంగమ్మ తల్లికి శెంగల్వ పూదండ,
కాలిందికీ తెల్ల కల్వదండా॥
గోదావరి తల్లికి గొజ్జంగి పూదండ,
సరసోతికీ సన్న జాజిదండా॥"

కూనిరాగం తీస్తూ నాయనమ్మ బియ్యపు చేట ముందు పెట్టుకు కూర్చుంది పెద్ద తమ్ముడి పోట్లాటలతో, చిన్న చెల్లెలి ఉత్తుత్తి అలకలతో, పసివాడి రోదన ధ్వనులతో గందర గోళంగా, పెళ్లియిల్లులా వుండే మా యిల్లు ఆ రోజు యెందుకో ప్రశాంతంగా వున్నది ఏడ్చి యేడ్చి చిన్న వాడు అప్పుడే అమ్మ ప్రక్కలో పడుకుని నిదురపోయాడు పెద్ద తమ్ముడు బడికి వెళ్లాడు. చిన్న చెల్లెలు పొరుగింటి బేబీతో ఆడుకోవటానికి కాబోలు వెళ్లింది

నిశ్శబ్దమయిన ప్రశాంతతకి వాచి పోతున్నాను, యిన్ని రోజుల నుంచీ చావిట్లో యీజీ చైరులో కూర్చుని పుస్తకం తెరిచాను

"కిష్ట యేణమ్మకి శేదంగి పూదండ,
కాయేరికీ చంద్రకాంతి దండా॥"

నాయనమ్మ కంటిన్యూ చేస్తున్నది పాటను ఏ మాత్రం సంస్కారం కానీ, రాగ జ్ఞానం కానీ లేని నాయనమ్మ పాటలో, భావంలో, రాగంలో—ఎంత మాధుర్యం! సంగీత జ్ఞానం యే మాత్రమూ లేదు నాయనమ్మకి ఏ స్థాయిలో యే విధంగా గొంతు పోణికించాలో, యే రాగానికి యే తాళం సరిపోతుందో ఆమెకి కొంచమైనా తెలీదు ఆ జానపద గీతం రచించిన ఆ పల్లె హృదయానికి వ్యాకరణం అంటే యేమిటో తెలీదు పోతే—గణ, యతి, ప్రాసల పేర్లు ఆ పల్లె కవి యే నాడూ విని వుండడు ఏదో మహత్తరానుభూతిలో, యేదో భరించలేని పరమానందం కలిగిన సమయంలో—ఆ హృదయంలోనుంచీ, ఆ పాట సహజంగా వచ్చి వుంటుంది అంతే! అయినా, ఆ పాటలో యెంత తియ్యదనం! జోకొట్టి నిద్ర పుచ్చుతున్నది

జానపద గీతామాధుర్యం నుంచి పుస్తకంలో లీనమయినాను మెల్లి మెల్లిగా అంతా స్వప్న జగత్తులో విహరిస్తున్నట్లే తోస్తున్నది

వాస్తవ ప్రపంచంనుంచీ యెంతో దూరం వెళ్లిపోయాము కవీ, నేనూ కొంతసేపు తెలిమబ్బుల్లో, చుక్కల కాంతుల్లో, కొంతసేపు కడలి పొంగుల్లో, యిసుక తిన్నెల్లో, కొంతసేపు సెలయేటి వంపుల్లో, అడవిపూల పరిమళాలలో తేలిపోయాను కవి చిత్రించిన చిత్రలోకంలోకి చొచ్చుకుని పోయినాను నీలిమబ్బులకు స్వర్ణరేఖలు అంచులు దిద్దుకుంటున్నవి సంధ్యారుణ కిరణాలు మెల్లిగా ప్రాకుతున్నవి ఆకాశంమీదకు నాయనమ్మనూ, వంటయింటినీ పూర్తిగా మరిచిపోయి గగన వీధుల్లో తేలిపోతున్నాను మహానంద సాగరాల అగాధపు లోతుల్లో తొంగి చూస్తున్నాను

ఇదే శాశ్వత ప్రపంచమైతే? ఇంత అందాన్ని, పవిత్రతని, మానవులకు అందరానిదిగా, అతిలోకంగా-సృష్టించాడెమి భగవంతుడు? మన యెదుటనే యింత అద్భుతమయిన అందాలు రాసులు పోసుకుని ఇంద్ర చాపాల్లో, పశ్చిమాకాశపు సువర్ణ రేఖల్లో, కుప్పలై కూర్చుండగా-చూడలేమెందుకు? మలయ మారుతపు సౌరభ్యాల్లో, గంగతరంగిణీ మృదుస్వరాల్లో-వెల్లువలై పోతున్న-రామణీయకాలను, ఒదిలిపెట్టి, నాలుగు గోడలమధ్య కృత్రిమ ప్రపంచాన్ని కల్పించుకుని,-యేమి సుఖం అనుభవిస్తున్నాం మనం? దైవం అన్నీ సృష్టించి కూడా, మనకు యింత సంకుచిత బుద్ధినిచ్చి, మాయ తెరల్లో దింపుతున్నాడెందుకు?

కోకిల మధురా రావాల లోకన్న, పని వాళ్ళ రోదనధ్వనుల్లో ఆనందమున్నదేమి? సహజమైన, వాస్తవమైన విశాల విశ్వంకన్నా, రాతిగోడలతో మూసుకు పోయిన దొరబంగళాలలో అందమున్నదేమి? పక్వమయిన, పరిపూర్ణమయిన, మధుర ఫలాలలోకన్న, శనగపిండి పకోడీలలో రుచివున్నదేమి?

ఉదయం లేచినదగ్గరనుంచి, మగవాడైతే, బయట ప్రపంచంలోకి వెళ్లి, ప్రొద్దస్తమానమూ తల పగలకొట్టుకునేటంత పని చేసి చెమటతో, అలసటతో-యింటికి చేరటం మామూలు దినచర్య ఆడదయితే అంట్లుతోమే దగ్గరనుంచి సమస్తమయిన అడ్డచాకిరీ చేసి, పిల్లల పోషణ చేసి చేసి, విసిగి వేసారిపోయి, సుఖమెరుగని జీవితానికి అలవాటయి పోతుంది సృష్టిలో యెంత అందమున్నదో, యెంత గల్లదవమున్నదో కనీసం ఆలోచించటాని కూడా తీరిక వుండదు వారికి ఇంకా, దేవుడు మేలు చేస్తే, యిరుగింటి విషయాలూ, పొరుగింటి విషయాలూ-కథలుగా, కథానికలుగా, వర్ణించి చెప్పుకోవటానికి కొంత కాలం భద్రం చేయగలరు (నేను *Excep, tion* అని చెప్పను ఆగ్రహించకండి) కాస్త కవి అయితే, సామాన్య ప్రజానీకం చూడని, చూడటానికి ప్రయత్నించని సుందర ప్రపంచాన్ని సృష్టించి లోకానికి అంకితమిస్తారు చిత్రకారుడయితే కుంచెతో యెన్నో మధురభావాల, యెన్నో రమణీయదృశ్యాలు చిత్రవిచిత్రంగా సృష్టించి ప్రపంచానికి సమర్పిస్తాడు కాని మనకు అవన్నీ తుణికొనం దాన్ని యిచ్చేవిగానే వుంటాయి మరు నిముషంనుంచీ డబ్బూ, వ్యాపారమూ,


ఖరీదు రు 15/-లకు తగ్గింపబడినది



పోస్టేజి ప్యాకింగు రు 5/లు అదనం
కొత్త నాజూకు మాడల్ చాలకాలం వుండును
పొడిమిగలది
చౌక
"కాక్ బ్రైట్ గాక్ లైట్"
ప్రకాశవంతమైన వెలుతురునిచ్చును
ఈ తగ్గింపుధర 15 రోజులకు మాత్రమే
GLOBE WATCH CO
(A, W) P Box 6843, Calcutta 7

పిల్లలూ, ఉద్యోగాలూ-మన లోకమే మనకు!

స్వప్న జగత్తులో వున్న నాకు వినిపించింది ఒక కేక కోకిలారావం కాదు నాయనమ్మ కేక.

“అట్లా యెప్పుడూ పుస్తకం పెట్టుకు కూర్చుంటే పని యెట్లా అవుతుందే? అయినా ఆడపిల్లలకు చదువూ, పుస్తకాలూ యేమిటమ్మా చోద్యం? మానాడు మేమేమీ యెరగం తమ్ముడు యిందాకనగా తిండికి వచ్చి కూర్చుంటే వాడి అతీగతీ చూడవాయెను వాడు చదువుకుంటున్నాడంటే వాడు మగబిడ్డాయెను నీవుకూడా తగుదునమ్మా అని పుస్తకం పెట్టుకుని కూర్చుంటే యెట్లా చెల్లుతుంది?”—దవడలు నొక్కుకున్నది నాయనమ్మ

భావ ప్రపంచపు మత్తు యింకా వదలనే లేదు నాయనమ్మ మాటలు బాగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ అర్ధనిమీలిత నేత్ర నయినాను

“ఆ! అయ్యొ అయ్యో! ఆ కళ్ళేమిటమ్మా! మూయకుండా, తెరవకుండా అదేమి చూపే? ఎన్నడూ లేనిది యివాళ యిదేమి చోద్యమమ్మా? ఏమయినా పైత్యంచిందా యేమి పాపమో! పలకనన్నా పలకదాయె నేనేం చేతునమ్మా!”—నాయనమ్మ అరుస్తున్నది

కవి తీసుకుపోయిన యే దివ్యలోకాల్లోనో విహరిస్తున్న నాకు యీ పొలికేకలు ములుకులవలె గ్రుచ్చుకున్నవి నాయనమ్మ వాక్ప్రవాహానికి అడ్డుకట్టవలెనని చేతులు అడ్డంగా త్రిప్పుతూ,

“దిగిరాను, దిగిరాను, దివినుండి భువికి”—సన్నగా, మధురంగా రాగంతీశాను

నాయనమ్మ చేతిలో చేట జారిపోయింది కనుగ్రుడ్లు నిశ్చలంగా వుండిపోయాయి ఆముఖం యెంత తమాషాగా వున్నదో చెప్పలేను గుండెలు బాదుకుంటూ,

“అయ్యో నాయనో! పిల్లకి యేదో పట్టుకుందర్రా! దెయ్యమో పిశాచమో నేనేం చేతునే తల్లీ! ఆమాట లేమిటి? ఆ పాటేమిటి? మొత్తుకున్నా వాటికి అర్థం తెలవకపాయే! అసలు పిల్ల కళ్లు అట్లా తేలవేస్తున్నదేం?”

అన్నానికి వచ్చిన తమ్ముడూ, ఉలిక్కిపడి లేచివచ్చిన అమ్మా, పొరుగింటి రామాయమ్మఅంతా-చేరారు నాచుట్టూ ఈ గందరగోళానికి నాసుందర భావ ప్రపంచం దూరంగా తొలిగిపోయింది. మయూర నృత్యాలూ, మబ్బు తెరలూ, మలయ మారుతాలూ-నన్ను అడక్కుండానే శెలవు పుచ్చుకున్నవి

“ఏమిటే మీ గోల?”—అన్నాను తెప్పరిల్లి

“ఇంతకు ముందు నీవన్న మాట యేమిటే? ఏమిటో ‘దిగిరాను’ అంటా వేమిటి? ఎక్కడనుంచి దిగిరవు? ఏమిటి కథ?” అన్నది నాయనమ్మ గ్రుక్క త్రిప్పుకోకుండా

అప్పటికి కాని అర్థంకాలేదు సంగతి

“అదా, నాయనమ్మా! దివినుండి భువికి దిగిరానన్నాను పుస్తకం చదువుకూవుంటే స్వర్గంలో వున్నట్లుగా వుందంటే నమ్మలేవు? ఆ స్వర్గంలోనుంచీ మళ్ళీ మన మామూలు ప్రపంచంలోకి దిగిరావాలంటే యెంతో కష్టంగా వుండి అట్లా అన్నాను నాయనమ్మా!”

“ఏడ్చినట్లే వుంది తెలివి! ఎంతపని చేశావూ! చదివి చదివి పైత్యం ప్రకోపించింది కామాలు! అందుకే ఆడవాళ్ళకు చదువు వద్దన్నది వెనకటి వాళ్లు ఎక్కడకో వెళ్లిందట! అక్కడనుంచి దిగిరాదట! ఇక్కడ బ్రతికి వుండగానే ఎక్కడకో పోవట మేమిటి? సరే కాని, వేషం కట్టిపెట్టి, లేచి తమ్ముడికి అన్నం పెట్టు పొయ్యిమీద పాలు వున్నాయి తోడంటు వేసిరా, బియ్యం ఏరుదూగాని”—నాయనమ్మ చేట ముందుకు లాక్కుని ఉస్సురంటూ చతికిలపడ్డది

తమ్ముడూ, అన్నమూ, పొయ్యీ, తోడంటూ—ప్రపంచంలోకి అమాంతంగా ఒక్కసారి వచ్చేశాను నీలాకాశపు అందాలను వదలిపెట్టి, సుధాచంద్ర చంద్రికాజ్యోత్స్నలను అడుగకుండానే శెలవుపెట్టి—దివినుండి భువికి జారిపడ్డాను!

★


ప్రపంచ ప్రఖ్యాత మద్రాసు నశ్యం

★ నాణ్యతయే దానిఘనత ★



★ ఒకసారి కొంటే తిరిగి వదలిపెట్టరు ★

నశ్యములలో ఉత్తమమైనది పట్నం నశ్యమే కాని అత్యుత్తమమైనది, అందరూ కోరునది, కారం, నాణ్యత, సువాసన గలది అప్పాదురై నశ్యమే

అ. అప్పాదురై ముదలియార్ & సన్స్

55, ఆచారప్పన్ వీధి, పోస్టుబాక్సు నెం 189, మద్రాసు-1



నమ్మకమైన నంజనగూడు కుటుంబ ఔషధములు

కాసమస్ కస్తూరిమాత్రలు

జంజిప్ జీర్ణవృద్ధికి పిత్తశాంతికి

కర్జన్ గోరోజనమాత్రలు

జ్వరెగ్ సకల జ్వరములకు

బాలక్స్ విరేచనమాత్రలు

కాలరెక్సు కాలరా అజీర్ణభేదులకు

తదితర మందులకై మాకు వ్రాయండి

నంజనగూడు-పళ్లపొడి

సోల్ ఏజంట్లు యునైటెడ్ కన్ సరన్, 54బందరు వీధి, మద్రాస్, బెజవాడడిపో సూర్యారావుపేట.